నమస్తే తెలంగాణ నిపుణ Guide to Excellence
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna
nipuna
Every Wednesday Free Supplement
03. 14 ఆగస్టు 2024
పేజీలు 8

**సునీల్ ఛెత్రి**

భారత దిగ్గజ ఫుట్‌బాలర్ సునీల్ ఛెత్రి జూన్ 6న ఆఖరి మ్యాచ్ ఆడాడు. 19 ఏండ్ల ఫుట్‌బాల్ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. ఛెత్రి మొత్తం 151 మ్యాచ్‌లు ఆడి, 94 గోల్స్ చేశాడు. ప్రపంచ కప్–2026 ఆసియా జోన్ క్వాలిఫయర్స్‌లో భాగంగా కోల్‌కతాలోని సాల్ట్ లేక్ స్టేడియంలో భారత్‌కు ఆఖరి మ్యాచ్‌ను కువైట్‌తో ఆడాడు. ఈ మ్యాచ్ డ్రా గా ముగిసింది. భారత్ తరఫున అత్యధిక అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన ప్లేయర్‌గా నిలిచాడు. 358 లీగ్స్ ఆడి 158 గోల్స్ చేశాడు.

# నేతాజీ నేతృత్వంలో స్వరాజ్య పోరాటం... భారత జాతీయ సైన్యం

గ్రూప్-1 ప్రత్యేకం
ఇండియన్ హిస్టరీ

- సుభాష్‌చంద్ర బోస్ 1897 జనవరి 23న జన్మించాడు. జన్మస్థలం ఒడిశాలోని కటక్. ఇంగ్లండ్‌లో ఉన్నత విద్యను అభ్యసించిన ఆయన ప్రతిష్ఠాత్మకమైన ఇండియన్ సివిల్ సర్వీసెస్ (ఐసీఎస్)కు ఎంపికయ్యాడు. భారతదేశానికి వచ్చిన తర్వాత సహాయ నిరాకరణ ఉద్యమం సందర్భంగా గాంధీజీ పిలుపును అందుకుని తన ఉద్యోగాన్ని వదిలేశాడు. స్వరాజ్య సమరంలోకి అడుగు పెట్టాడు.
- చార్లెస్ టెగార్ట్ హత్యకేసులో భాగంగా సుభాష్‌చంద్ర బోస్ 1924లో జైలుకు వెళ్లాడు. 1925లో చిత్తరంజన్ దాస్ మరణం తర్వాత ఆయన బెంగాల్ నాయకుల్లో, కాంగ్రెస్ పార్టీ ప్రముఖ నాయకుల్లో ఒకరిగా అవతరించాడు. తర్వాత కాలంలో జవహర్‌లాల్ నెహ్రూతో కలిసి కాంగ్రెస్‌లో వామపక్ష భావజాలం ఉన్న నాయకుడిగా పేరు తెచ్చుకున్నాడు.
- మోతీలాల్ నెహ్రూ నివేదికలో పేర్కొన్న అధినివేశ ప్రతిపత్తి (డొమీనియన్ స్టేటస్)ని కాదని జవహర్‌లాల్ నెహ్రూతో కలిసి పూర్ణ స్వరాజ్ కావాలని పట్టుబట్టాడు. అయితే తన ఆదర్శాలను అలా ఉంచి గాంధీజీతో నెహ్రూ సత్సంబంధాలు నెరిపాడు. సుభాష్ చంద్ర బోస్ మాత్రం గాంధీజీతో విభేదాలను వ్యక్తిగత స్థాయిలో కూడా కొనసాగించాడు.
- ఈ క్రమంలో బోస్ 1937లో హరిపుర కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. ఆ తర్వాతి సంవత్సరం త్రిపురి కాంగ్రెస్ సమావేశంలో గాంధీజీ ప్రతిపాదించిన భోగరాజు పట్టాభి సీతారామయ్యను ఓడించి రెండోసారి అధ్యక్షుడయ్యాడు. దీంతో 'పట్టాభి ఓటమి నా ఓటమి' అని గాంధీజీ వ్యాఖ్యానించాడు.

**జర్మనీ– జపాన్ పర్యటన**

- ఇదే సమయంలో 1939లో రెండో ప్రపంచ యుద్ధం మొదలైంది. బోస్ యుద్ధంలో బ్రిటిష్‌వారిని వ్యతిరేకించి, జర్మనీ నేతృత్వంలోని ప్రధాన కూటమితో కలవాలని అభిప్రాయపడ్డాడు. ఈ విషయాన్ని కాంగ్రెస్ ఎటూ తేల్చలేకపోయింది. పైగా సుభాష్‌చంద్ర బోస్ కూడా తన కార్యవర్గాన్ని నియమించడంలో విఫలమయ్యాడు. తర్వాతి పరిణామాల్లో ఆయన కాంగ్రెస్‌ను విడిచిపెట్టాల్సి వచ్చింది. తర్వాత ఫార్వర్డ్‌బ్లాక్ పేరుతో సొంత రాజకీయ పార్టీని స్థాపించాడు.
- బోస్‌ను అనుమానించిన బ్రిటిష్ ప్రభుత్వం 1940, జూలై 2న ఆయనను అరెస్టు చేసింది. తర్వాత గృహ నిర్బంధంలో ఉంచగా, 1941, జనవరి 16న ఆయన దేశం విడిచి వెళ్లిపోయాడు. మొదట అఫ్గానిస్తాన్, తర్వాత రష్యా, అక్కడినుంచి జర్మనీ చేరుకున్నాడు.



- జర్మనీ చేరుకున్న బోస్ అక్కడ బెర్లిన్‌లో నాజీ నాయకుడు హిట్లర్‌ను కలుసుకున్నాడు. బెర్లిన్ రేడియో ద్వారా బ్రిటిష్ వ్యతిరేక ప్రసంగాలు చేశాడు. జర్మన్ సైన్యానికి పట్టుబడ్డ భారతీయ సైనికులతో కలిసి అక్కడే ఇండియన్ లీజియన్ అనే సైన్యాన్ని తయారు చేశాడు.
- అయితే భారతదేశ స్వతంత్రానికి సంబంధించి జర్మన్ నాయకుల నుంచి ఎలాంటి హామీ రాకపోవడంతో, బోస్ జర్మన్ జలాంతర్గామిలో రహస్యంగా 1943, జూన్ 13 నాటికి జపాన్ రాజధాని టోక్యో నగరం చేరుకున్నాడు. అంతేకాదు జపాన్ ప్రధానమంత్రి టోజో నుంచి భారత స్వాతంత్ర్యానికి హామీ కూడా పొందగలిగాడు.
- అప్పటికే జపాన్ సేనలు రెండో ప్రపంచ యుద్ధంలో సింగపూర్, ఇతర ఆగ్నేయ ఆసియా దేశాలను ఆక్రమించుకుని, భారతదేశం వైపు పురోగమిస్తున్నాయి. ఈ క్రమంలో పట్టుబడిన భారతీయ సైనికులతో కెప్టెన్ మోహన్‌సింగ్ అప్పటికే భారత జాతీయ సేన (ఇండియన్ నేషనల్ ఆర్మీ)ను ఏర్పాటు చేశాడు. అయితే మోహన్‌సింగ్‌ను జపాన్ ప్రభుత్వం అరెస్టు చేయడంతో ఇది నిజరూపం దాల్చలేదు.

**ఆజాద్ హింద్ ఫౌజ్**

- 1943, జూలై 2న సింగపూర్ చేరుకున్న బోస్‌కు అక్కడ సాదర స్వాగతం లభించింది. అక్కడే ఆయన రాస్ బిహారీ బోస్ స్థాపించిన ఇండియన్ ఇండిపెండెన్స్ లీగ్ బాధ్యతలనూ స్వీకరించాడు. ఈ సందర్భంగా ఆయన తాత్కాలిక భారత ప్రభుత్వం ఏర్పడుతుందని, భారతదేశ స్వాతంత్ర్యానికి భారత జాతీయ సేనను నడుపుతానని ప్రకటించాడు.
- అలా 1943, జూలై 5న ఆజాద్ హింద్ ఫౌజ్ ఏర్పాటైంది. బోస్ చలో ఢిల్లీ నినాదం ఇచ్చాడు. తర్వాత అదే ఏడాది అక్టోబర్‌లో బోస్ ప్రభుత్వాధినేతగా, సర్వసైన్యాధ్యక్షుడిగా తాత్కాలిక భారత ప్రభుత్వం ఏర్పాటు చేశాడు. ఇందులో ఏసీ ఛటర్జీ ఆర్థికమంత్రిగా, ఎస్ఏ అయ్యర్ ప్రచార, సిద్ధాంతకర్తగా, లక్ష్మీ స్వామినాథన్ మహిళా వ్యవహారాలకు బాధ్యులుగా నియమితులయ్యారు.
- తాత్కాలిక ప్రభుత్వం ఆధ్వర్యంలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాటానికి సిద్ధం కావాలని బోస్ భారతీయులందరికీ పిలుపునిచ్చాడు. ఈ ప్రభుత్వాన్ని జర్మనీ, జపాన్, ఇటలీ, క్రొయేషియా, థాయ్‌లాండ్, బర్మా, ఫిలిప్పీన్స్, మంచూరియా గుర్తించాయి.
- జపాన్ సైన్యాలు తాము ఆక్రమించిన అండమాన్ నికోబార్ దీవులను 1943, నవంబర్‌లో బోస్‌కు అప్పగించాయి. ఆయన వాటికి షహీద్, స్వరాజ్ దీవులు అని పేరుపెట్టాడు.

**భారత్‌వైపు పురోగమనం**

- తర్వాత బర్మాకు చేరుకున్న బోస్ తన సేనలకు శిక్షణ అవసరమన్న విషయాన్ని గుర్తించాడు. ఈ క్రమంలో గాంధీ బ్రిగేడ్ (దీనికి తానే స్వయంగా నేతృత్వం వహించాడు), జవహర్ బ్రిగేడ్, సుభాష్ బ్రిగేడ్ (షానవాజ్ ఖాన్ నేతృత్వం), రాణీ ఝాన్సీ బ్రిగేడ్ (లక్ష్మీ స్వామినాథన్)లను ఏర్పాటు చేశాడు. అంతేకాదు భారత జాతీయ సేన నిర్ణయాల్లో జోక్యం చేసుకోవద్దని జపాన్ వారిని ఒప్పించాడు.
- బర్మా రాజధాని రంగూన్ నుంచి 1944, ఫిబ్రవరిలో సుభాష్ బ్రిగేడ్ రెండు విభాగాలుగా రెండు మార్గాల నుంచి భారతదేశం వైపు కదిలింది. మే నెలకల్లా బర్మాలోని కలాదన్ లోయ వైపు నుంచి నాగాలాండ్‌లోని కాక్స్ బజార్‌కు దగ్గర్లోని మౌడాక్ పోస్ట్ వద్ద భారత జాతీయ సైన్యం భారత భూభాగంలోకి అడుగుపెట్టింది. మరో దళం రంగూన్ నుంచి మాండలే మీదుగా కదిలి కలేవా చేరుకుంది. 1944, మే నాటికి ఈ దళం బ్రిటిష్ సైన్యాన్ని ఓడించి కొహిమాను తమ అధీనంలోకి తెచ్చుకుంది.
- జూన్ నెలలో బ్రిటిష్ సైన్యం నుంచి ప్రతిదాడి మొదలుకావడం, అదే సమయంలో వర్షాలు కురవడంతో భారత జాతీయ సైన్యం మళ్లీ బర్మా వైపు కదిలేలా పరిస్థితులు మారిపోయాయి. పులి మీద పుట్రలా పసిఫిక్ ప్రాంతంలో జపాన్ సైన్యాలకు బ్రిటన్, అమెరికా మొదలైన దేశాల కూటమి సైన్యాల నుంచి ప్రతిఘటన ఎదురైంది. దాంతో భారత జాతీయ సైన్యానికి జపాన్ సహాయం కూడా ఆగిపోయింది.
- మరోవైపు ఈశాన్య భారతదేశపు కొండప్రాంతంలో యుద్ధం కొనసాగించడం కూడా కష్టంగా మారిపోయింది. అలా భారత జాతీయ సైన్యం ఇంఫాల్ ముట్టడి విఫలమైపోయింది. చివరికి 1945, మే నెలలో బ్రిటిష్ సైన్యాలు జపాన్ నుంచి బర్మాను తిరిగి ఆక్రమించుకున్నాయి.
- అదే ఏడాది ఆగస్టులో జపాన్‌లోని హిరోషిమా, నాగసాకి నగరాల మీద అమెరికా అణుదాడి జరపడంతో జపాన్ లొంగిపోయింది. ఆగస్ట్ 18న సుభాష్‌చంద్ర బోస్ విమాన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడని తెలుస్తున్నా, ఇప్పటికీ ఆ వార్త చర్చనీయాంశంగా మిగిలింది.

**ఎర్రకోట విచారణ**

- జీఎస్ ధిల్లాన్, పీకే సెహగల్, షానవాజ్ ఖాన్ నేతృత్వంలోని లొంగిపోయిన భారత జాతీయ సైన్యం అధికారుల మీద బ్రిటిష్ ప్రభుత్వం ఢిల్లీలోని ఎర్రకోటలో విచారణ జరిపింది. ఈ ముగ్గురూ భారతదేశ మూడు ప్రధాన మతాలైన సిక్కు, హిందూ, ఇస్లాం మతాలకు చెందినవారు కావడం విశేషం. వీరి విడుదల కోసం దేశమంతటా ప్రదర్శనలు, నిరసనలు జరిగాయి.
- సుభాష్‌చంద్ర బోస్ విధానాలతో విభేదించినప్పటికీ కాంగ్రెస్ కూడా ఈ విషయాన్ని తీవ్రమైనదిగానే పరిగణించింది. ప్రభుత్వానికి ప్రతివాదులుగా భూలాభాయ్ దేశాయ్, జవహర్‌లాల్ నెహ్రూ, మహమ్మద్ అలీ జిన్నా, తేజ్ బహదూర్ సప్రూ, అసఫ్ అలీ ముందుకువచ్చారు.
- కాంగ్రెస్ కూడా ఐఎన్ఏ విచారణ అంశం మీద దేశవ్యాప్తంగా ప్రజలను చైతన్యపర్చింది. ఇంకా ఐఎన్ఏ నిధిని కూడా ఏర్పాటు చేసింది. ప్రజలు ఈ నిధికి తమకు తోచిన మొత్తంలో విరాళాలు ఇచ్చారు. 1945 నవంబర్ 5–11 తేదీల మధ్య ఐఎన్ఏ వారం పాటించారు.
- దేశవ్యాప్తంగా జరిగిన సమావేశాల్లో పార్టీలకు అతీతంగా అందరూ తమ సంఘీభావాన్ని ప్రకటించారు. దీంతో పీకే సెహగల్, జీఎస్ ధిల్లాన్, షానవాజ్ ఖాన్‌కు విధించిన మరణ శిక్షను రద్దుచేస్తూ అప్పటి గవర్నర్ జనరల్ లార్డ్ వేవెల్ వారికి క్షమాభిక్ష ప్రసాదించాడు.

**ఆజాద్ హింద్ ఫౌజ్ ప్రాధాన్యం**

- వనరులు తక్కువగా ఉండటం, సైన్యం పరిమితంగా ఉండటం, శిక్షణ తగినంతగా లేకపోవడం, జపాన్ సహకారం మీద ఆధారపడటం లాంటివి భారత జాతీయ సైన్యం తన పోరాటంలో విఫలమయ్యేందుకు ప్రధాన కారణాలుగా కనిపిస్తాయి.
- అంతమాత్రాన భారత స్వాతంత్ర్య పోరాటంలో ఐఎన్ఏ పాత్ర మరీ తక్కువేమీ కాదు. వారి వీరోచిత పోరాటం, అసమానమైన త్యాగం ప్రపంచ ప్రజల దృష్టిని ఆకర్షించాయి. పైగా బ్రిటిష్ వారి తరఫున పోరాడుతున్న భారతీయ సిపాయిల్లో కూడా వీరిపట్ల సానుభూతి పెల్లుబికింది. దీంతో బ్రిటిష్ పాలన పట్ల భారతీయ సైనికుల విధేయత ప్రశ్నార్థకంగా మారిపోయింది.
- ఆ మరుసటి ఏడాది జరిగిన రాయల్ ఇండియన్ నేవీ తిరుగుబాటు సందర్భంలో ఈ విషయం మనకు స్పష్టంగా కనిపిస్తుంది. బ్రిటిష్‌వారు దేశానికి స్వాతంత్ర్యం తొందరగా ఇవ్వడానికి మరో తిరుగుబాటు తలెత్తకముందే దేశాన్ని విడిచిపోవాలనుకోవడం ఓ కారణంగా తెలుస్తుంది.
- భారత జాతీయ సైన్యం సుభాష్‌చంద్ర బోస్ నాయకత్వ పటిమనే కాకుండా, ఆయన దేశభక్తికి కూడా నిదర్శనంగా నిలుస్తుంది. హిట్లర్‌తో చర్చించినా, టోజోతో మాట్లాడినా భారత ప్రజానీకం స్వేచ్ఛా వాయువులు పీల్చుకోవాలన్నదే ఆయన ప్రధాన లక్ష్యంగా కనిపిస్తుంది. అందుకే కోట్లాది మంది భారతీయులు ఆయనను ఇప్పటికీ గౌరవిస్తున్నారు.

## రాయల్ ఇండియన్ నావికుల తిరుగుబాటు

- రాయల్ ఇండియన్ నావికుల తిరుగుబాటు 1946, ఫిబ్రవరి 18–23 తేదీల మధ్య జరిగింది. ఆ సమయంలో దేశం మొత్తం నావికులకు బాసటగా నిలిచింది. అయితే దీనికి చరిత్రలో ప్రాధాన్యం దక్కలేదు.
- తమకు నాసిరకమైన ఆహారం పెడుతున్నారని, బ్రిటిష్ అధికారులు తమను అణచివేస్తున్నారని బొంబాయిలోని భారతీయ నావికులు (రేటింగ్స్ అంటారు) ఇచ్చిన ఫిర్యాదును కమాండింగ్ అధికారి కింగ్ బుట్టదాఖలు చేశాడు. దాంతో వారు ఫిబ్రవరి 18న నిరాహార దీక్ష చేపట్టారు. ఎవరూ పనికి వెళ్లలేదు.
- ఈ సంఘటనతో నావికాదళంలో తిరుగుబాటు మొదలైంది. దీనికి ప్రధాన కేంద్రం బొంబాయి. సమ్మె మొదట ఐఎన్ఎస్ తల్వార్ నౌకలో ప్రారంభమైంది. ఆ తర్వాత బొంబాయి తీరంలో ఉన్న మిగిలిన నౌకలకు ఆ వార్త చేరుకొంది. వారంతా కూడా ఎంఎస్ ఖాన్ నాయకత్వంలో సమ్మెకు దిగారు. నౌకల మీద కాంగ్రెస్, ముస్లిం లీగ్, కమ్యూనిస్ట్ పార్టీల జెండాలు ఎగురవేశారు.



- నాణ్యమైన ఆహారం ఇవ్వాలి, ఆంగ్లేయ ఉద్యోగులతో సమాన వేతనాలతోపాటు ఇండోనేషియాలో ఉన్న భారతీయ సైనికులను వెనక్కి రప్పించాలి, భారత జాతీయ సైన్యం ఖైదీలను విడుదల చేయాలన్న డిమాండ్లను వారు ప్రభుత్వం ముందుంచారు.
- విషయం తెలుసుకొని బొంబాయికి చేరుకొన్న అడ్మిరల్ గాడ్ ఫ్రే సమ్మె విరమించకపోతే నిరసనకారుల మీద బాంబులు కురిపించాల్సి వస్తుందని హెచ్చరించాడు. అప్పటి బ్రిటిష్ ప్రధాని క్లెమెంట్ అట్లీ కూడా నావికులు శాంతించకపోతే బొంబాయికి యుద్ధ విమానాలను పంపిస్తామని ప్రకటించాడు.
- ఈలోపు సమ్మె విషయం దేశంలోని ఇతర ప్రదేశాల నావికులకు కూడా చేరింది. కరాచీ, కలకత్తా, విశాఖపట్నంలో నావికులు ఫిబ్రవరి 20న సమ్మెకు దిగారు. ఇది ఆ తర్వాత కొచ్చిన్, అండమాన్ దీవులకు కూడా వ్యాపించింది.
- నావికులకు ఆర్మీ, వైమానిక దళంలోని భారతీయ సైనికులు కూడా తమ సంఘీభావాన్ని తెలపడంతో సమ్మెకు దిగిన ఓడలను బ్రిటిష్ సైనికులు చుట్టుముట్టారు. నావికుల మీదికి ఫిరంగి గుళ్లు కురిపించారు. దీనికి నావికులు దీటుగా బదులిచ్చారు.
- పరిస్థితి తీవ్రరూపం దాల్చడంతో కమ్యూనిస్టు పార్టీ ఫిబ్రవరి 22న హర్తాళ్ జరపాలని ప్రజలకు సూచించింది. ఫలితంగా బొంబాయిలో మిల్లులన్నీ మూతబడ్డాయి. ప్రభుత్వ కార్యాలయాలు, దుకాణాలు తెరుచుకోలేదు.

మిగతా 4వ పేజీలో..

సంకలనం
హర్షవర్ధన్ చింతలపల్లి